




సిఐటియు ప్రాంతీయ సమావేశాల బహిరంగసభలో ప్రసంగిస్తున్న సిహెచ్ నర్సింగరావు



పడమటి మండలాల్లో టమోటాలను, వంకాయలను రోడ్డుపక్కన పారేసి వెళ్లే సంఘటనలే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అనేకం చూశాం... అయితే ఎపుడో రెండు మూడేళ్లకోసారి కూరగాయల ధరలు ఆకాశానికెక్కుతాయి.. అందుకునే ప్రయత్నం చేయాలన్నా అందనంత దూరంగా ధరలు పలుకుతాయి.. ఆ రోజులే కూరగాయల రైతులకు 'బంగారు' రోజులు.. రైతులు కూరగాయల ధరలు బాగుండటంతో ఆనందం వ్యక్తం చేస్తుండగా, వినియోగదారులు మాత్రం కొనలేక కాల్‌కేజీలు కొని బంగారంలా కొంచెం కొంచెం సర్దుకు తింటున్నారు.



కూరే.. 'బంగారమాయేగా..'

రైతు మోములో ఆనందం/వండేవారి కళ్లల్లో వ్యథ

ప్రజాశక్తి - కెవిబిపురం

కూరగాయలను బంగారం కంటే ఎక్కువగా కాపాడుకుంటూ, అదునుకు వాటిని కోస్తూ, మార్కెట్‌కు తరలించి అంతోఇంతో లాభాలు పొందుతారు. కూరగాయల ధరలన్నీ కిలో రూ.60-150 పలుకుతున్న తరుణంలో కెవిబిపురం మండలంలో రైతన్నలను 'ప్రజాశక్తి' పలకరించింది. ప్రస్తుత తరుణంలో రైతుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. వరి, చెరకు, వేరుశనగ గిట్టుబాటు కాని పక్షంలో కూరగాయలు సాగు చేసేందుకు రైతన్నలు సమాయత్తం అవుతున్నారు. కెవిబిపురం మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో దాదాపు 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ కూరగాయలు, మల్లి, సంపంగి, రోజా వంటి పంటలు పండిస్తూ లాభసాటిగా ముదుకు సాగుతున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత ఇంతటి లాభాలు వచ్చాయన్న వారి ఆనందం వారి మాటల్లోనే..

రోజుకు రూ.2వేల ఆదాయం : ఈశ్వరయ్య, రైతు



నేను పీజీ చదువుకున్నాను. అయినా నాకు వ్యవసాయం చేయడం చాలా ఇష్టం. మాకు ఉన్న ఆరు కుంటల పొలంలో చిక్కుడుకాయలు నాటాను. రోజుకు 200 కిలోలు చిక్కుడుకాయలు కాస్తున్నాయి. కేజీ 70 లెక్కన రోజుకు 1400-2వేల వరకూ సంపాదిస్తున్నాను.

ఇంతరేటు రావడం ఇదే మొదటిసారి : నరసయ్య, రైతు



మాకు ఎకరా పొలం ఉండేది. మా నాన్న హయాంలో పైరు సాగు చేసి అప్పుల పాలై అమ్మేశాడు. ఐదు కుంటలు ఉంది. ఆ పొలంలోనే సొరకాయ, మల్లితోట వేశాను. రోజుకు వెయ్యి ఆదాయం వస్తోంది. కూరగాయలను, పూలను చెన్నయ్ మార్కెట్‌కు తరలిస్తునాం. సొరకాయలు కిలో రూ.20-30కి తీసుకుంటున్నారు. 15రోజులకు ఒకసారి డబ్బులిస్తారు. 15వేలు ఆదాయం వస్తోంది. నెలకు 30వేలు పైమాటే.

అప్పుల్లేకుండా జీవిస్తున్నాం : కందస్వామి, రైతు



మా వ్యవసాయ పొలంలో పైరు చేసినపుడు అప్పులే మిగిలేవి. దిక్కుతోచక పూల సాగు చేయడం ప్రారంభించాను. ఏడు కుంటల స్థలంలో మల్లి, రోజా, చేమంతి వేశాను. రోజుకు వెయ్యి రూపాయల ఆదాయం వస్తోంది. కాయగూరలు, పూల సాగు చేస్తున్న తరువాత మా కుటుంబం సురక్షితంగా అప్పుల్లేకుండా జీవిస్తున్నాం.

పెట్టుబడి తక్కువగా లాభాలొస్తున్నాయి : వజ్రవేలు, రైతు



వ్యవసాయం చేసేటపుడు విత్తనాలు, పురుగుల మందులకే పెట్టుబడి పెట్టాల్సి వచ్చేది. పెట్టుబడి కోసం ప్రైవేట్ అప్పులు చేసేవాళ్లం. అవి తీర్చలేక ఇళ్లల్లో మనశ్శాంతి లేకుండా బతికేవాళ్లం. కూరగాయలు సాగు చేస్తున్నప్పటి నుంచి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను చూస్తున్నాం.

అంగన్వాడీల 36 గంటల ధర్నాను జయప్రదం చేయండి

10, 11 తేదీల్లో సిఐటియు సంఘీభావం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ / సూళ్లూరుపేట

ఈనెల 10, 11 తేదీల్లో కలెక్టరేట్‌ల వద్ద జరిగే 36 గంటల ధర్నాకు సిఐటియు సంఘీభావం ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు వెల్లడించారు. గూడూరు పట్టణంలోని జరుగుతున్న సిఐటియు ప్రాంతీయ సమావేశాలలో గురువారం సాయంత్రం జరిగిన భారీ బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి, కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న విధానాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేకతను మూటగట్టుకుని ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వరంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టారని అదానీ, అంబానీల రాజ్యం సాగుతోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో బిజెపి చెప్పిన దాన్ని తలాడించే ప్రభుత్వంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తయారయిందని, ఈ రెండింటి కార్మిక వ్యతిరేక విధానాల వల్లే తీవ్రమైన సమస్యలు పెరిగాయని ఆయన గుర్తు చేశారు. అంగన్వాడీలు, మధ్యాహ్న భోజనం, ఆశ తదితర స్కీం వర్కర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గూడూరు రూరల్ అంగన్వాడీ అధ్యక్షురాలు ఇందిరావతి పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గూడూరు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. అనంతరం గోడ పత్రికలను విడుదల చేశారు. ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచాలన్నారు. సుప్రీం కోర్ట్



తీర్పు ను అనుసరించి గ్రాట్యుటీ తక్షణమే అమలు చేయాలన్నారు. మీని సెంటర్ లను మెయిన్ సెంటర్ లాగా మార్చాలన్నారు. ఫ్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలన్నారు. సర్వీస్‌లో ఉంటూ చనిపోయిన కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలన్నారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న డిఎ బిల్లులను చెల్లించాలని అదేవిధంగా వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. ఈనెల 10 వ తేదీ నుండి 36 గంటల పాటు తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నామని , డివిజన్ లోని అంగన్వాడీ కార్యకర్తలు , హెల్పర్స్ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రభావతి , సాయమ్మ , లక్ష్మీ , అరుణ , ముని కుమారి , ఆసియా పాల్గొన్నారు.

సూళ్లూరుపేట ప్రాజెక్టు కార్యదర్శి మేకల హైమావతి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సిడిపిఒ శారదకు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఆగస్టు 9న 'క్విట్ మోదీ..సేవ్ ఇండియా' ఆందోళనలు

తిరుపతి టౌన్ : క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 9న 'క్విట్ మోడీ... సేవ్ ఇండియా' పేరుతో జరగనున్న ఆందోళనలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి పిలుపునిచ్చారు. ఈ మేరకు జులై 7న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సులో కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్మికులందరూ పాల్గొని ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ పేరుతో లక్షల కోట్ల ప్రజల ఆస్తులను విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు ధారపోస్తోందని, ఇటువంటి పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం నుంచి దేశాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సి ఉందన్నారు.

పోరాటాల స్ఫూర్తితో ఉద్యమ నిర్మాణం

గూడూరులో సిఐటియు ప్రాంతీయ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

పోరాటాల స్ఫూర్తితో సిఐటియు సంఘాన్ని విస్తరించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ చేపడతామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఉద్ఘాటించారు. సంఘాన్ని బలోపేతం చేసే నేపథ్యంలో ప్రాంతీయ సమావేశాలు రెండు రోజుల పాటు గూడూరులో జరుగుతున్నట్లు చెప్పారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వందమంది ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. తొలిరోజు సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. సిఐటియు ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు 'ప్రజాతంత్ర పని విధానం', జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం 'క్షేత్రస్థాయి నిర్మాణం...క్షేత్రస్థాయి కృషి, మండల, గ్రామ, వార్డుల కమిటీల కృషి'పై వివరించారు. శ్రామిక మహిళా కన్వీనర్ ఆర్.వరలక్ష్మి శ్రామిక మహిళల పోరాటాలను వివరించారు. ఈ ప్రాంతీయ సమావేశాల్లో గూడూరు సిఐటియు నాయకులు జోగి శివకుమార్, చిత్తూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, సురేంద్ర, అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, రామాంజనేయులు, రాష్ట్ర అంగనవాడి కోశాధికారి ఎస్. వాణిశ్రీ, గూడూరు అంగన్వాడి నాయకురాలు ప్రభావతి గూడూరు ఆటో యూనియన్ పట్టణ కార్యదర్శి బి.వి. రమణయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, వి.ఆర్.ఏ. జిల్లా కార్యదర్శి సుబ్బయ్య, ఎలక్ట్రిసిటీ నాయకులు టి.వెంకటరామిరెడ్డి, బి.గోపీనాథ్, ఎస్. సురేష్, ఏ. ప్రసాద్ పాల్గొన్నారు.

మంచికి, చెడుకి మధ్యే ఈసారి ఎన్నికలు : ఎంఎల్‌ఎ

తిరుపతి టౌన్ : నెహ్రూనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గురువారం ఉదయం ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి నిర్వహించారు. ఈసారి ఎన్నికలు జగన్ మంచితనానికి, చంద్రబాబు చెడుకు మధ్య వచ్చే ఎన్నికల్లో యుద్ధం జరుగుతుందన్నారు. ప్రజలు మంచిని కోరుకుంటారే తప్ప దుర్మార్గపు పాలన అందించిన చంద్రబాబు చెడును కోరుకోరన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు.


ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలి : ఎఐవైఎఫ్

తిరుపతి టౌన్ : సిఎం జగన్మోహన్‌రెడ్డికి నిరుద్యోగుల ఆవేదన పట్టడం లేదని, మాటిచ్చి మోసం చేశారని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, కత్తిరవి పేర్కొన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అని అంటూనే మాట, మడమ అని తిప్పారన్నారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల 35వేల 794 ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్‌చేస్తూ తిరుపతి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి చలపతి, తరుణ్‌కుమార్; సునీల్ పాల్గొన్నారు.

'యాక్సిస్ నిఫ్టీ ఐటి ఇండెక్స్ ఫండ్' విడుదల

తిరుపతి సిటీ : భారతదేశంలో వేగంగా అభివద్ధి చెందుతున్న ఫండ్ హౌస్‌లలో ఒకటైన యాక్సిస్ మ్యూచువల్ ఫండ్, తమ కొత్త ఫండ్ ఆఫర్ యాక్సిస్ నిఫ్టీ ఐటి ఇండెక్స్ ఫండ్ ను విడుదల చేసినట్లు ఫండ్ మేనేజర్ హితేశ్ దాస్ తెలిపారు. పోర్ట్‌ఫోలియో పరంగా స్టాక్ మార్కెట్ ఇండెక్స్‌ను పునరావతం చేయడం ఇండెక్స్ ఫండ్ ప్రధాన లక్ష్యం అన్నారు. యాక్సిస్ సీఈవో గోప్‌కుమార్ మాట్లాడుతూ పలు రంగాలలో సాంకేతికత ద్వారా మార్పును తీసుకురావడంలో భారతదేశం అగ్రగామిగా ఉంది. కోవిడ్ తర్వాత గత మూడు సంవత్సరాలలో ఇది మరింత ఎక్కువగా కనిపిస్తుందన్నారు. యాక్సిస్ నిఫ్టీ ఐటి ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించడంతో, తాము తమ ఉత్పత్తుల పోర్టుఫోలియో విస్తరిస్తున్నామన్నారు.

త్వరలోనే అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటు



ప్రజాశక్తి-తిరుపతి టౌన్

స్వాతంత్ర సమరయోధులు , విప్లవ వీరులు, మన్యం దొర,అల్లూరి సీతారామరాజు మనవడు అయిన అల్లూరి శ్రీ రామరాజు తిరుపతిలో పలువురు క్షత్రియ నాయకులను గురువారం కలిసారు. తిరుపతి క్షత్రియ సేవా సమితి గౌరవ అధ్యక్షులు కేఎల్.వర్మ ప్రత్యేకంగా అల్లూరి శ్రీరామరాజు క్షత్రియ అసోసియేషన్ బలోపేతం పై తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. రాయలసీమలో ప్రధాన పట్టణమైనటువంటి తిరుపతిలో క్షత్రియ అసోసియేషన్ కార్యక్రమాలు బాగా చేస్తున్నారని వర్మను వారు అభినందించారు. క్షత్రియులలో యువత ఎక్కువమంది బాగా చదువుకొని ఉన్నారని అనేక రంగాల్లో స్థిరపడి ఉన్నారని వారందరినీ కూడా ఏకతాటి మీదికి తీసుకువచ్చి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని శ్రీరామరాజు సూచించారు. ఇప్పటికే తిరుపతిలో శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, కార్పొరేషన్ మేయర్ శిరీష అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహ ప్రతిష్టాపనకు అంగీకరించారన్నారు. త్వరలో పనులు చేపట్టి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాధాకష్ణ వర్మ, నెహ్రూ రాజు, వైయస్ రాజు, జగదాబి గోపి, అనిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిష్టర్లు వాయిదా వేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ



క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయ డిగ్రీ విద్యార్థులకు ఈనెల 15 నుంచి ప్రారంభం కావాల్సిన రెండు, నాలుగు సెమిష్టర్ పరీక్షలు వాయిదా వేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వీసీ కె.రాజారెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి ఎస్.మాధవ్ మాట్లాడుతూ మార్చి 28వ తేదీన మొదటి, మూడో సెమిష్టర్ పరీక్షలు పూర్తి చేసుకన్న డిగ్రీ విద్యార్థులకు ఏప్రిల్‌లో 23 రోజులు, జూన్‌లో 25 రోజులు మాత్రమే తరగతులు జరిగాయని, యుజిసి నిబంధనల ప్రకారం కనీసం 90 రోజులు తరగతులు జరిగితేనే సెమిష్టర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. తక్షణమే షెడ్యూల్‌ను రద్దు చేసి పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్‌చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు అక్బర్, ఉరుకుందు, అశోక్, శివ, రాహుల్, స్వరూప్ పాల్గొన్నారు.



హస్త కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఓజిలి

హస్త కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి పేర్కొన్నారు. ఓజిలి మండల కేంద్రంలోని కె.భార్గవ్ రెడ్డి, మనోజ్ఞ నిర్వహిస్తున్న విలేజ్ పెయింటర్స్ హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్ హస్తకళ వస్త్రాలను పరిశీలించారు. అన్ని జిల్లాలలో జగనన్న మహిళ హస్త కళాకారుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి మహిళ హస్త కళాకారులకు తోడ్పాటు అందిస్తామన్నారు. హస్త కళాకారులు తయారు చేసిన వివిధ రకాల కళాకతులు ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. విలేజ్ పెయింటర్స్ అద్భుతంగా తయారు చేసిన వివిధ రకాల చీరలను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా హస్తకళ తయారుదారులు మాట్లాడుతూ లేపాక్షి ఎంపోరియంలో తాము తయారుచేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, ఎగ్జిబిషన్లో తమ కళాకతులు విక్రయించేందుకు అవకాశం ఇప్పించాలని, గుర్తింపు కార్డులతో పాటు హస్తకళ వత్తిదారులకు ప్రోత్సాహం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ హెచ్‌డి అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పివీ.రామకష్ణ, తిరుపతి లేపాక్షి ఎంపోరియం మేనేజర్ సత్యనారాయణ, ముని రెడ్డి, లేపాక్షి సిబ్బంది వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా క్రియా విశ్వవిద్యాలయం కాన్వొకేషన్

తిరుపతి సిటీ : శ్రీ సిటీలో ఉన్న క్రియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో కాన్వొకేషన్ వేడుకను ఘనంగా నిర్వహించారు. కాన్వొకేషన్ వేడుక యూజి కోహోర్ట్ ఆఫ్ ఎస్ ఐఏఎస్ (స్కూల్ ఆఫ్ ఇంటర్‌వోవెన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్) (2023), ఎస్ ఐ ఏ ఎస్ లో పీజీ డిప్లొమా, (2023) ఐ ఎఫ్ ఎమ్ ఆర్ జి ఎస్ బి (గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్)లో 2-సంవత్సరాల ఎంబీఏ (2023)), ఐఎఫ్‌ఎమ్‌ఆర్ జి ఎస్ బి (2023)లో 3 సంవత్సరాల ఎల్ అండ్ టి ఎంబిఏ క్రియా విశ్వవిద్యాలయం, మద్రాస్ విశ్వవిద్యాలయం (2023)లో పీహెచ్డీకి అవార్డులు, డిగ్రీలను ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేసిన వారిలో సుజాత రావు, మాజీ కేంద్ర కార్యదర్శికి, సుచిత్రా ఎల్లా సహ వ్యవస్థాపకురాలు, భారత్ బయోటెక్ వైద్య శాస్త్రంలో కృషికి పొందారు. క్రియా విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ఎన్ వఘుల్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు కపిల్ విశ్వనాథన్, డీన్ ప్రొఫెసర్ లక్ష్మీ కుమార్, సియాస్ అకాడమిక్ డీన్ డాక్టర్ పథ్వీ దత్తా శోభి, క్రియా కమ్యూనిటీలోని ఇతర సభ్యుల సమక్షంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు మాట్లాడుతూ "ఈ సంవత్సరం తాము రికార్డు స్థాయిలో విద్యార్థులను గ్రాడ్యుయేట్ చేస్తున్నామన్నారు. క్రియా విశ్వవిద్యాలయంలో వారి అధ్యయనాలు వారిని వారి సబ్జెక్టుల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాయని, ఆ క్రమశిక్షణ వారిని అత్యుత్తమ స్థితిలో ఉంచుతుంది అన్నారు.



చంద్రయాన్-3 ప్రయోగానికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో సారి ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ ప్రయోగానికి సిద్ధం అయ్యింది. జూలై నెల 14 న చంద్రయాన్ -3 ఉపగ్రహ ప్రయోగానికి అన్ని ఏర్పాట్లను శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. గత వైఫల్యాలను సరిచేసి సరికొత్త సాంకేతిక పరికరాలతో తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం నుండి చంద్రయాన్ ప్రయోగం జరపనుంది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి ఇస్రో ఎల్వీఎం మార్క్-3 రాకెట్ ద్వారా చంద్రయాన్ -3 ఉపగ్రహ ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. శ్రీహరికోట లోని రెండవ ప్రయోగ వేదిక నుండి మధ్యాహ్నం 2 గంటల 35 నిమిషాలకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఈ ప్రయోగం జరుగుతుంది. చంద్రుని పై దాగి ఉన్న రహస్యాలను శోధించడానికి ప్రధానంగా ఈ ప్రయోగాన్ని ఇస్రో నిర్వహిస్తోంది. చంద్రుని పై ఎలాంటి వాతావరణం ఉంది? అక్కడ వాతావరణ పరిస్థితుల పైన అధ్యయనం చేయడానికి భవిష్యత్‌లో మానవ సహిత చంద్రయాన్ ప్రయాణానికి అవసరమైన పరిశోధనల కోసం ఈ చంద్రయాన్ -3 ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. ఈ ప్రయోగం జరిగిన 42 రోజుల తరువాత ఉపగ్రహం లోని ల్యాండర్ చంద్రుని పై దిగే విదంగా ఉపగ్రహాన్ని రూపకల్పన చేసి ఉన్నారు.



అంటే భూమి నుండి 42 రోజుల పాటు ఉపగ్రహం చంద్రుని వైపుకు ప్రయాణం చేస్తుంది. 2008 లో ఇస్రో ప్రయోగించిన మొదటి చంద్రయాన్ -1 ప్రయోగం ద్వారా పంపిన ఆర్బిటర్ ద్వారా చంద్రుని పై నీటి ఆనవాళ్లను ఇస్రో గుర్తించింది. అలాగే 2019 చేపట్టిన చంద్రయాన్ -2 ప్రయోగంలో ఆర్బిటర్ ద్వారా ఒక ల్యాండర్ ను, ఒక రోవర్ ను పంపింది. లాండింగ్ సమయంలో సంబంధాలు తెగిపోవడంతో అది కాస్త పాక్షిక విజయంగా మిగిలిపోయింది. అపజయాలు విజయాలకు సోపానాలుగా మలచుకుని ఇస్రో ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో చంద్రయాన్ -3 తయారు చేసి ప్రయోగానికి సిద్ధం చేసింది. ఇప్పటికే చంద్రుని పై అడుగు పెట్టి సత్తా చాటిన అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన చేరడానికి భారత్ చంద్రయాన్ -3 ప్రయోగ విజయం కోసం ఎదురుచూస్తోంది. ఈ ప్రయోగానికి సంబందించిన విండో జులై 12 నుండి 19 వరకు అందుబాటులో ఉంటున్న నేపథ్యం లో 14 వ తేదీన ప్రయోగానికి ముహూర్తం నిర్ణయించారు.


ఆర్పీల ఇష్టారాజ్యం

మెప్మాలో వసూళ్ల 'పర్వం' 'కమీషన్' ఇస్తేనే 'రుణం'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

పేద మహిళలకు ఆసరాగా ఉండాల్సిన మెప్మా అధికారులు వసూళ్ల పేరుతో అవినీతికి తెరలేపేశారు. మెప్మా అధికారులు ఆర్పీల సహకారంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'కమీషన్' ఇస్తేనే రుణం మంజూరవుతుందని, లేదంటే ఫైల్ కదలదని బాధితులు వాపోతున్నారు. రుణమొచ్చినా, ఆసరా డబ్బులొచ్చినా, పావలా వడ్డీలొచ్చినా అంతా ఆమ్యామ్యాలే. ఇదంతా బహిరంగ రహస్యమే.


పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు మెప్మా ద్వారా రుణాలు ఇస్తున్నారు. ఇందులో ప్రత్యక్షంగానే కొందరు ఆర్‌పిలు వసూళ్లకు పాల్పడుతున్నారు. రుణాలు ఇచ్చేది బ్యాంకులు, కట్టేది పొదుపు సంఘాల మహిళలు. అయితే మధ్యలో ఆర్పీలు బ్యాంకులో రుణం ఇప్పించేందుకు కష్టపడుతున్నామంటూ



చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. అయితే తమకు డబ్బు ఇచ్చినట్లు ఎవరికీ చెప్పకూడదని ముందస్తుగానే లోలోపల ఒప్పందాలూ జరిగిపోతుంటాయి. అయితే లబ్దిదారుల నుంచి వారికి 'కమీషన్లు' అందుతున్నాయన్నది బహిరంగ రహస్యం.

మెప్మా పరిధిలో ఉన్న పొదుపు గ్రూపుల్లో ఒక్కోసంఘానికి పది మంది సభ్యులు తక్కువగాకుండా ఉంటారు. కొన్ని గ్రూపులు కలిపి సమాఖ్యలుగా ఏర్పాటుచేశారు. ఆయా గ్రూపుల సభ్యుల నుంచి ఆర్పీలను ఎన్నుకుంటారు. వీరిపై మళ్లీ సీవో (కమ్యూనిటీ ఆర్గనైజర్స్) ఉంటారు. వీరు ప్రభుత్వపరంగా అమలయ్యే పథకాల ఫలాలను లబ్దిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత వీరిది. బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణం మంజూరులో సహాయపడాలి. స్త్రీనిధి తదితర రుణాలకు, చెల్లింపులు సకాలంలో చేయించాలి. అయితే కొంతమంది ఆర్పీలు లక్షకు 500-1000 చొప్పున వసూలు చేస్తుండటం గమనార్హం. అదేమని అడిగితే బ్యాంకుల చుట్టూ తిరిగి రుణం ఇప్పిస్తున్నామని, ఖర్చులు ఉంటాయని సమాధానం చెబుతుండటం గమనార్హం. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా ఆర్పీలపై పర్యవేక్షలకుగా ఉండే సివోలు, సిఎంఎం, ఆపైన పీడీలు ఏం చేస్తున్నారనే సందేహాన్ని మహిళాసంఘాలు లేవనెత్తుతున్నాయి.

ప్రభుత్వ బడుల్లోనే సృజనాత్మకంగా బోధన



ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: తరగతి గదిలో విద్యార్థులకు సజనాత్మకంగా బోధన చేస్తూ మాతభాష తెలుగుపై మక్కువ, అభిరుచిని కలిగించేలా బోధన చేయాలని మండల విద్యాశాఖ అధికారి-2 మునిసుబ్రమణ్యం అన్నారు. గురువారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో తెలుగు ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు భాషపై పట్టు కలిగిస్తూ విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్యబోధన చేయాలన్నారుజ తెలుగు విషయ నిపుణులు యువశ్రీ మురళీ, తెలుగు ఉపాధ్యాయులు పురుషోత్తం, మునస్వామి, ప్రసాదరావు, సరళ, రాధ, చెంగాలమ్మ, జలజ, ఉషారాణి, వేదవతి, మునీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ తహాశీల్దారుగా భార్గవి



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల నూతన తహాశీల్దార్‌గా భార్గవి గురువారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహాశీల్దారు శివయ్య, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్వోలు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు.

ఆత్మీయ సమ్మేళన సభను జయప్రదం చేయాలి




ప్రజాశక్తి-గూడూరు: సంచార జాతుల ఆత్మీయ సమ్మేళన సభను జయప్రదం చేయాలని తోలుబొమ్మలాట కుల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ సంచారజాతుల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి సంచార జాతులను బీసీ-బీలో కలుపుతూ జీవో జారీ చేసి ప్రభుత్వ పథకాలు అందేలా కషి చేసిన మహానుభావుడన్నారు. ఈ నెల 18న ఉమ్మడి నెల్లూరు జిల్లా లోని అంబేద్కర్ భవన్ లో జరిగే సంచార జాతుల సభకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సంచార జాతుల మహిళలు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు, పెద్దలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బాలకష్ణ వేడుక సంచార జాతుల జాతీయ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వంలో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తోలు బొమ్మలాట కుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు బిందే శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి వనపర్తి రమేష్, గౌరవ సలహాదారు సిందే చిన కొండయ్య, గూడూరు డివిజన్ నాయకులు బాబు, వెంకటేశ్వర్లు, సిందే వెంకటేశ్వర్లు, సిందే వెంకయ్య పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ అసోసియేషన్ 73వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని గురువారం నాయుడుపేట పట్టణ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. పిచ్చిరెడ్డితోపులో జీసస్ ఫౌండేషన్‌లోని అనాథ వద్దులకు రెండు నెలలకు సరిపడా వంట సరుకులను వితరణగా చేశారు. కార్యక్రమంలో ఐ.సి.ఈ.యు బ్రాంచ్ సెక్రటరీ బి.సతీష్ కుమార్, ప్రెసిడెంట్ సురేంద్రబాబు, జాయింట్ సెక్రెటరీ ఎం సునీల్, ట్రెజరర్ వేణు, మాధవరావు పాల్గొన్నారు.

విలువైన చరిత్రను పరిరక్షించుకోవాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చరిత్ర అంటే మానవీయ విలువలను పెంపొందించే మార్గంగా చరిత్ర సబ్జెక్టును నేటి తరం విద్యార్థులకు అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని హిస్టరీ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దొంతిబోయిన శివ నాగరాజు కోరారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో మానవీయ విలువలు క్షీణిస్తున్నాయంటే చరిత్ర తెలియకపోవడమేనన్నారు. హిస్టరీ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపీచంద్ ప్రకాష్ మాట్లాడుతూ చరిత్ర సబ్జెక్టును కామన్ సబ్జెక్టుగా చేయాలన్నారు. ఈనెల 8వ తేదీ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సెట్ హాల్ వేదికగా నిర్వహించే చరిత్ర సబ్జెక్టుతో పరిరక్షణ రెండో రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయడానికి విద్యావంతులు, మేధావులు, ప్రజా ప్రతినిధులు తరలివస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి సదస్సు బ్రౌచర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎన్. శివశ్వేత, జాయింట్ సెక్రెటరీ బాబురావు, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, ప్రధాన సలహాదారు లాబాను, ఐద్వా నాయకురాలు సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట పిచ్చిరెడ్డితోపులో దంపతులు చిల్లకూరు సునీల్ అతని భార్య నయనశ్రీ కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. గురువారం సాయంత్రం నయనశ్రీ నివాసంలోనే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న సీఐ నరసింహారావు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న సురక్ష'.. ఓ అద్భుతం



పుత్తూరు టౌన్:



గూడూరు టౌన్ :



పిచ్చాటూరు:

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర చరిత్రలోనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న 'జగనన్న సురక్ష' పథకం ఓ అద్భుతమైన సంక్షేమ పథకమని.. రాష్ట్ర పర్యాటక శాఖ ఆర్.కె.రోజా అన్నారు. పుత్తూరు మున్సిపాలిటీ రాచపాళం సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిలాంటి ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఉంటే మన ఇంట్లో మన బిడ్డ ముఖ్యమంత్రి అయినట్లే అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబాన్నీ తన సొంత కుటుంబంగా భావించి తాను పాదయాత్రలో చూసిన.. విన్న కష్టాలను దూరం చేయడానికి వారికి భరోసా ఇచ్చిన విధంగా ముఖ్యమంత్రి అయిన మొదటి రోజు నుంచే సంక్షేమ కార్యక్రమాలు అందుబాటులోకి రావాలని కషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మునిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్లు జయ ప్రకాష్, శంకర్, సచివాలయం కన్వీనర్, కౌన్సిలర్లు, నోడల్ అధికారి, రాష్ట్ర డైరెక్టర్లు, అధికారులు, సచివాలయం సిబ్బంది, డాక్టర్ కష్ణంరాజుబాబు, మనోహర్ రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని వాలాయనంతపురంలో జరిగిన గనన్న సురక్షలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడారు. అనంతరం పలువురికి ఉచితంగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, వైసిపి సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్, తాళ్లూరు శ్రీనివాసులు, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వాణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: గోవర్ధనగిరి గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మట్లాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ గ్రామాలు అభివద్ధి చెందేలా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చి అందరినీ అర్హుల జాబితాలో చేరుస్తున్నాడన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహాశీల్దారు మధుసూదన్ రావు, జడ్పీటీసీ విష్ణు ప్రియ, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, ఎంపిటీసీ రమేష్ రాజు, సచివాలయ మండల అధ్యక్షుడు తొప్పయ్య, పాల పద్మనాభం, మోహన్, చలపతి రాజు నాయకులు, పాల్గొన్నారు.

బాలాయపల్లి: అన్ని శాఖల అధికారులు గ్రామాల్లోనే చేరుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెంగమాంబపురం, కయ్యూరు గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామ సభలు జరిగాయి. వెంగమాంబపూరం ప్రాథమిక పాఠశాల స్థలం ఆక్రమణ చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని ఎంపీపీ దష్టికి తీసుకొచ్చారు. అనంతరం ప్రజలు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో తహాశీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో రవీంద్రబాబు, ఈవోపీఆర్డీ తదితరులు పాల్గొన్నారు.



బాలాయపల్లి:

నూతన కార్యవర్గాల బాధ్యతల స్వీకరణ





ప్రజాశక్తి-గూడూరు: ప్రముఖ అంతర్జాతీయ సేవా సంస్థలు రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ గూడూరు శాఖలకు 2023-24 సంవత్సరం కు నూతన కార్యవర్గాలు బుధవారం బాధ్యతలు స్వీకరించాయి. స్థానిక ద్వారాకామాయి ఫంక్షన్ హాల్ (సీఆర్ మార్ట్) లో జరిగిన ఈ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ఇన్స్టలేషన్ ఆఫీసర్లగా డాక్టర్ .సీహెచ్. శరత్ బాబు, బొమ్మిరెడ్డి మైథిలీలు వ్యవహరించారు. వారు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులుగా రామకష్ణ స్వరూప్, కార్యదర్శి గా పి. శ్రావణ్ కుమార్ లు బాధ్యతలు స్వీకరించారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం. విష్ణు వందన, కొండా శశి రేఖ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జనార్ధన్ రెడ్డి, డాక్టర్ రోహిణి దంపతుల చేతులు మీదుగా గూడూరు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి అత్యున్నత మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రముఖులు దశరథరామిరెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్లు కొణిదల మునిగిరీష్, మయూరి శ్యాంసుందర్ రావు, చిన్న మల్లయ్య, బాలకష్ణం రాజు, శ్రీధర్ రెడ్డి, కళ్యాణ్ చక్రవర్తి, రవి కుమార్, తిరుమూరు సురేష్ రెడ్డి, ఎస్ వీ నాగేంద్ర ప్రసాద్, నాగ సునీల్, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌గా ఆచార్య రామకృష్ణారెడ్డి



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీ యూనివర్సిటీ సైన్స్ కళాశాల ఫ్యాకల్టీ డీన్ గా ఆచార్య కె.తులసీరామకష్ణారెడ్డిని నియమిస్తూ విశ్వవిద్యాలయ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి , రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ అందజేశారు. ఆచార్య రామకష్ణారెడ్డి భౌతిక శాస్త్ర ఆచార్యులుగా 31 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. మార్చి నుంచి సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆచార్య కె.తులసీరామకష్ణారెడ్డిని వర్సిటీ పరిశోధన, అభివద్ధి డీన్ ఆచార్య ఎస్. విజయభాస్కర రావు, పలువురు ఆచార్యులు అభినందనలు తెలిపారు.

డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 15 నుంచి ప్రారంభం కావాల్సిన రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్వీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.రాజారెడ్డిని కలిసి గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.మాధవ కష్ణ మాట్లాడుతూ మార్చి 28వ తేదిన మొదటి, మూడవ సెమిస్టర్ పరీక్షలు పూర్తి చేసుకున్న డిగ్రీ విద్యార్థులకు ఏప్రిల్ నెలలో 23 రోజులు, జూన్ నెలలో 25 రోజులు తరగతులు మాత్రమే తరగతులు జరిగాయని ఆరోపించారు. యూజీసీ నిబంధనల ప్రకారం విద్యార్థులకు కనీసం 90 రోజులు తరగతులు జరిగితేనే సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఇందుకు విరుద్ధంగా ఉన్నత విద్యా మండలి అధికారులు యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగిస్తూ తప్పనిసరిగా 15 నుండి పరీక్షలు నిర్వహించాలని యూనివర్సిటీల అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి బలవంతంగా పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అక్బర్, ఉరుకుందు, నాయకులు అశోక్, శివ, రాహుల్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ద్రోహి జగన్మోహన్ రెడ్డి : టిఎన్ఎస్ఎఫ్



ప్రజాశక్తి-క్యాంపస్: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు తిరుపతి ఎంఆర్ పల్లి కూడలిలో టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులతో కలిసి అన్నమయ్య కూడలి వరకు ర్యాలీగా నిరసన తెలిపారు. ముఖ్య అతిథిగా తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ చంద్రన్న ప్రభుత్వం 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజ్ రీయంబర్స్ మెంట్ ఇవ్వగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం దానిని 10.97 లక్షల మంది విద్యార్థులకు కుదించడం దుర్మార్గం అని విమర్శించారు. తెలుగుదేశం హయాంలో రెండు డీఎస్సీలు నిర్వహించి 16,829 మంది నిరుద్యోగులకు టీచర్ ఉద్యోగాలిచ్చారని, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చి రెండేళ్లయినా ఒక్క డీఎస్సీ నిర్వహించలేదని విమర్శించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు చిన్నబాబు, పార్లమెంటు ఉపాధ్యక్షులు మునిశేఖర్ రాయల్, నగర టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు వెంకటేశ్ యాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే, పరస బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గం అధ్యక్షులు కోబాకు లక్ష్మణ్, నాగేంద్రబాబు, బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయండి



ప్రజాశక్తి -తొట్టంబేడు: భూ రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని తిరుపతి జాయింట్ కలెక్టరు డీకే బాలాజీ ఆదేశించారు. తొట్టంబేడు మండల తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఆయన భూ రీసర్వేపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ... భూముల రీ సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి రెవిన్యూ గ్రామంలో ఈ సర్వే ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. భూ రికార్డుల పరిశీలన జాగ్రత్తగా చేయాలన్నారు. రికార్డుల్లో ఏవైనా తప్పులు ఉంటే సరిదిద్దాలన్నారు. వీలైనంత వరకు మ్యుటేషన్లు పెండింగ్ లేకుండా చేయాలన్నారు. మ్యుటేషన్లలో అక్రమాలకు చోటు ఇవ్వకూడదన్నారు. కుటుంబ పెద్ద చనిపోయి ఉంటే ఆ ఆస్థిని సభ్యుల విజ్ఞప్తి మేరకు సమస్యలు రాకుండా భూములు వారి పేరిట బదలాయించాలన్నారు. ఇందులో ఎలాంటి వివాదాలు రాకుండా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో సర్వేయర్లు జాగ్రత్తగా రీ సర్వే చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురవాలని ఆయన కోరారు. ఈ సమీక్ష సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డీవో కేఎస్ రామారావు, ఏడీ జయరాజ్, తొట్టంబేడు తహసీల్దారు ఎర్రంరెడ్డి సుధీర్ రెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

'అల్లూరి స్ఫూర్తిగా వైసీపీని తరిమికొడదాం'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తెల్ల దొరలకు ఎదురొడ్డిన అల్లూరి స్ఫూర్తిగా దుష్టపాలన చేస్తున్న వైసీపీని తరిమి కొట్టాలని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు పిలుపు నిచ్చారు. ఇటీవల చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిన ఎస్సీవీ నాయుడు దాదాపు 20 సంవత్సరాల అనంతరం తిరిగి ఎన్టీఆర్ భవన్లో గురువారం అడుగుపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలన రాక్షస పాలనను తలపిస్తోందని వాపోయారు. దోచుకో..దాచుకో.. దాడి చెయ్.. దగా చెయ్ అన్న రీతిలో జగన్ పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి చరమగీతం పాడి చంద్రబాబును గెలిపించుకోకుంటే రాష్ట్రం గతి అధోగతి పాలేనని హెచ్చరించారు. బొజ్జల బందమ్మ తో పాటు పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించడానికి స్మగ్లర్లు ఎప్పటికప్పుడు తమ రూట్లను మారుస్తున్నారు. కొంతమంది స్మగ్లర్లు వెంకటగిరి-రాపూర్ ప్రాంతాల్లోని పెంచలకోన అడవుల్లో మకాం వేసి ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నారని సమాచారంతో ఎర్రచందనం పరిరక్షణ ప్రత్యేక కార్యదళం అధికారులు నిఘా పెంచి స్మగ్లర్ల ఆట కట్టిస్తున్నారు. టాస్క్ ఫోర్స్ అధికారులు పెంచలకోన అటవీ ప్రాంతంపై పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేసి సాధారణ బలగాలతో పాటు అదనపు బలగాలను అడవిలో కూంబింగ్ కోసం మోహరించారు. టాస్క్ ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలోని ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బందం రాపూరు రేంజి గోనుపల్లి సెక్షన్ కొత్తపల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో ని ల పెద్దగట్టు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా కొంతమంది స్మగ్లర్లు ఎర్రచందనం దొంగలను మోసుకొని వెళుతూ కనిపించారని, లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేయడంతో దుంగలను పడేసి పారిపోతుండగా వెంటబడి ఓ స్మగ్లర్ ను పట్టుకున్నామని.. ఇతడు తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లా జమునా మత్తూరు తాలూకా కోవిలంటూరు గ్రామానికి చెందిన మురుగన్ వెలయ్యన్ గా గుర్తించామన్నారు. సంఘటన ప్రాంతంలో 12 ఎర్రచందనం దొంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అన్నాదురై, దక్షిణామూర్తి, రేణుసెన్నూరు, కుప్పుస్వామి, వేలు సెన్నూరు, అజిత్ తప్పించుకున్నారని తెలిపారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీడ్ బాల్‌తో కాలుష్య నివారణ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రస్తుతం వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ వర్షాకాలంలో సీడ్ బాల్‌లను తయారు చేసి మొక్కలు లేని ప్రాంతాలలో వేయడంతో అవి మొక్కలుగా ఎదిగి చెట్లుగా రూపాంతరం చెందడంతో వాతావరణ కాలుష్యం తగ్గుతుందని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం కళాశాల జాతీయ సేవా పథకం, సేవా నేచురియల్ సంస్థ సంయుక్తంగా కళాశాలలో 500 మంది విద్యార్థులతో కలిసి "సీడ్ బాల్ మేకింగ్ "రెండు రోజుల వర్క్ షాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి సేవ నేచురియల్ సంస్థ ఆర్థిక సహకారాన్ని అందించి ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ టి.చంద్రయ్య, డాక్టర్ కె. సుజన్ కుమార్, నరేన్ కుమార్, అనిల్ కుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ జూనోసిస్ డే



ప్రజాశక్తి-క్యాంపస్: అంతర్జాతీయ జూనోసిస్ డే సందర్భంగా వెటర్నరీ విభాగం ఆధ్వర్యంలో తిరుపతిలోని స్థానిక తాతయ్యగుంట పశు వైద్య చికిత్స సముదాయంలో ఉచిత యాంటీ రాబిస్ టీకా క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్య కళాశాల డీన్ డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవ రోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ఇక్కడ ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తిరుపతిలో స్థానిక ప్రజలు, పశు యజమానులు, జంతువులకు సంబంధించిన వివిధ రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స చేసుకోవడం జరుగుతుందన్నారు. పశు వైద్య కళాశాల అసోసియేట్ ఇన్ డాక్టర్ ఆదిలక్ష్మమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.